క్లుప్తంగా

క్షయ వ్యాధిపై అవగాహన

ఓడీచెరువు : క్షయ రోగులతో సన్నిహితంగా ఉన్న వారికి వ్యాధి నిర్ధారణ కోసం బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీవై-టీబీ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు డాక్టర్ భానుప్రకాష్, డాక్టర్ కమల్ రోహిత్ తెలిపారు. క్షయ లక్షణాలపై అవగాహన కల్పించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు టీపీటీ మందులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి విజయకుమారి, మురళీధర్, దిల్షాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెట్రో ధరల పెంపుపై నిరసన



ఆటోను లాగుతూ నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

ధర్మవరం అర్బన్: పెట్రోలు, డీజిలు, గ్యాస్ ధరల పెంపుపై నిరసన పెల్లుబుకింది. పెంచిన ధరలు తక్షణమే తగ్గించాలని సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, అయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో బుధవారం ధర్మవరంలో ఆందోళన చేపట్టారు. కళాజ్యోతి సర్కిల్‌లో గ్యాస్ సిలెండర్‌తో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచి బడుగు బలహీన వర్గాల ప్రజలు, పేదలపై మోయలేని భారాన్ని పెంచారన్నారు. విద్యుత్ చార్జీలు సైతం పెంచారన్నారు. ప్రభుత్వం స్పందించి పెట్రో ధరలు తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్.ఆదినారాయణ, హైదర్‌వలి, చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి, వెంకటస్వామి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలకు వ్యతిరేకంగా ముదిగుబ్బలో సీపీఎం ఆధ్వర్యంలో ఆటోను తాడుతో లాగుతూ నిరసన తెలిపారు. మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, నాయకులు బాబ్‌జాన్, పోతులయ్య, నాగప్ప, చాంద్‌బాషా, అల్లాబక్షు, చికెన్ రఫీ, సుధాకర్, పక్కీరప్ప, ఆజప్ప, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ



ప్రధాన రహదారిపై వృథాగా పోతున్న తాగునీరు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్ఎస్ గేటుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన మున్సిపల్ తాగునీటి పైపులైను బుధవారం లీకేజీ ఏర్పడింది. వారం రోజుల క్రితం వైఎస్సార్ కాలనీ, కేతిరెడ్డి కాలనీ ప్రజలు తాగునీరు అందించలేదని ఆందోళనలు చేశారు. ఇప్పుడేమో పైపులైను లీకేజీ కారణంగా నీరంతా వృథాగా పోతోంది. అధికారులు స్పందించి వెంటనే లీకేజీని అరికట్టి నీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానించిన దృశ్యం

ఎన్పీకుంట: మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయం నుంచి బదిలీపై వెళ్తున్న టీఏ, కంప్యూటర్ ఆపరేటర్లకు బుధవారం సిబ్బంది ఘనంగా సన్మానం చేశారు. మండల పరిషత్ కార్యలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ ఈటె రాము అధ్యక్షతన వీడ్కోలు సమావేశం నిర్వహించారు. బదిలీపై వెళ్తున్న టీఏలు రమేష్, కపివర్, అంజినప్ప, కంప్యూటర్ ఆపరేటర్ అలీ, ఏఎస్ఎమ్‌లు శంకరమ్మ, దేవి, రాధాకుమారిలకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అంజినప్ప, ఏపీఓ మంజుల పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నూతన కన్వీనర్ల నియామకం



రవి నాయక్



శ్యామ్ సుందర్‌రెడ్డి

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ పుట్టపర్తి పట్టణ కన్వీనర్‌గా బ్రాహ్మణపల్లి తండాకు చెందిన రవినాయక్ నియమితులయ్యారు. కొత్తచెరువు మండల నూతన కన్వీనర్‌గా తలమర్ల మాజీ సర్పంచ్ శ్యామ్‌సుందర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. తమ నియామకానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి, పార్టీ నాయకులకు నూతన కన్వీనర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

బస్సును ఢీకొన్న బైక్

నల్లచెరువు: మండల పరిధిలోని పాత రైల్వే స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వస్తున్న యనమలవారిపల్లికి చెందిన బాబూరావు, నల్లచెరువుకు

స్వచ్ఛత ఉత్తిదే



సోమందేపల్లి మండలం వెలిదడకల గ్రామంలోని తాగునీటి ట్యాంక్ దుస్థితి



పుట్టపర్తి మండలం పెదపల్లి తండాలో పాఠశాల వాటర్ ట్యాంక్ వద్ద బురద

- పేరుకుపోతున్న చెత్త నిల్వలు
- రోడ్లపై పారుతున్న మురుగు
- వాటర్ ట్యాంకుల వద్ద అపరిశుభ్రత

పుట్టపర్తి అర్బన్: స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ పేరిట ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని చెపుతోంది. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్లాప్ మిత్రలు, డ్రైడే-ఫ్రైడే అంటూ పలు కార్యక్రమాలు చేపట్టినా ఫలితం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ప్రధాన రోడ్లపై చెత్తను ఊడ్చి.. దాన్ని గ్రామ చివరన రోడ్ల పక్కన పడేస్తున్నారు. మరోవైపు తాగునీటి ట్యాంకులు, కొళాయిల వద్ద నీరు నిలిచి దుర్వాసన వస్తోంది. పలు వీధులతోపాటు పాఠశాలలు, ప్రధాన కూడళ్ల వద్ద బురదమయంగా మారుతోంది. డ్రెయినేజీల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచి రోడ్లపై పారుతోంది. రోజుల తరబడి అలానే ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. అపరిశుభ్రత కారణంగా దోమలు పెరిగి.. రోగాలు వ్యాప్తి చేస్తున్నాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే ఈ విధంగా ఉన్నా పట్టనట్టు వ్యవహరించడంపై ప్రజలు మండిపడుతున్నారు.



పుట్టపర్తి మండలం కత్తివారిపల్లిలో రోడ్డుపైనే మురుగు నీరు

విషపురుగులతో బెంబేలు



బత్తలపల్లి మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. చెత్తాచెదారం కారణంగా పాములు, తేళ్లు తదితర విషపురుగులు సమీపంలోని నివాస గృహాల్లోకి వస్తున్నాయి. విషపురుగులతో విద్యార్థులూ భయాందోళన చెందుతున్నారు. సమస్యను విద్యాశాఖ అధికారులు, మండల పరిషత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవ్వరూ పట్టించుకోలేదు.

– పల్లపోతుల మల్లికార్జున, బత్తలపల్లి

హౌసింగ్ ఏఈపై ఆగ్రహం

- లబ్ధిదారులకు ఇబ్బందులు పెట్టడం ఏంటి?



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాము

ఎన్పీకుంట: లబ్ధిదారులకు ఇబ్బందులు పెడుతున్నారంటూ గృహనిర్మాణ శాఖ ఏఈ శ్రావణిపై ఎంపీపీ ఈటె రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గృహనిర్మాణాల మంజూరు కోసం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతోందన్నారు. అయితే ఎన్పీకుంటలోని ఏఈ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయకుండా లబ్ధిదారులను గాండ్లపెంటలోని కార్యాలయానికి రావాలని ఏఈ చెప్తున్నారన్నారు. లబ్ధిదారులను మరొక మండలానికి పిలిపించుకుని ఇబ్బందులు కలిగించడం ఏమిటని ఎంపీపీ నిలదీశారు. ఇందుకు ఏఈ సమాధానమిస్తూ ఇక్కడి కార్యాలయంలో కంప్యూటర్, ప్రింటర్ లేనందున గాండ్లపెంటలో ఆన్‌లైన్ చేయాల్సి వస్తోందన్నారు. వంకమద్దిలో దాతలిచ్చిన స్థలంలో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనం శిథిలదశకు చేరుకుందని, అయితే స్థలం పత్రాలు ఏవీ లేకపోవడంతో మరమ్మతులు చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ అంజినప్ప తెలిపారు. వెంటనే పాఠశాల స్థలానికి సంబంధించిన హద్దుల ఏర్పాటుకు నివేదికలు సిద్ధం చేయాలని ఎంఈఓ గోపాల్‌నాయక్‌ను ఆదేశించారు. మండల కేంద్రంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కోఆప్షన్ సభ్యులు సుబహాన్ ఈఓపీఆర్డీని కోరారు. స్త్రీ నిధి రుణాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తున్నారని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎదురుదొన, మరికొమ్మదిన్ని, టీఎన్ పల్లి పంచాయతీల్లో విద్యుత్ లైన్‌మెన్లను నియమించాలని సభ్యులు కోరారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహానికి ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు నీటి సమస్య పరిష్కారం కోసం సీఎస్ఆర్ లేదా పంచాయితీ గ్రాంట్‌తో పనులు చేపట్టేందుకు తీర్మానం చేశారు. ఆర్‌సీ, కేజీబీవీ, ఆర్‌డబ్ల్యూస్ అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపూర్ణ, ఎంపీటీసీలు సరస్వతి, క్రిష్ణమ్మ, తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ సుబహాన్, సర్పంచులు రాధ, దిల్షాద్, చంద్రకళ, నాగమునీశ్వర నాయుడు, విష్ణుమూర్తి, వెంకటేశు, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించిన చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట ధ్వజం



నల్లమాడ మండల వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్/ నల్లమాడ: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పుట్టపర్తి రూరల్, నల్లమాడ మండలాల విస్తృతస్థాయి సమావేశాల్లో దుద్దుకుంట కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ హామీలన్నీ నెరవేర్చి సంక్షేమ రాజ్యస్థాపనకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయకుండా విస్మరించిందని మండిపడ్డారు. కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్తా సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ పేరుతో హామీలు గుప్పించిన చంద్రబాబు.. అధికారంలోకి రాగానే వాటిని అటకెక్కించారని ఎద్దేవా చేశారు. హామీలతో ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల అమలులోనూ ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంబిస్తోందన్నారు. పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు తదితరులు నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పుట్టపర్తి రూరల్ మండల కన్వీనర్ నరసారెడ్డి, ఎంపీపీ రమణారెడ్డి, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, మాజీ సర్పంచ్ చిత్తరంజన్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్ కుళ్ళాయిరెడ్డి, బాబు, మాబు, హనుమంత్ రెడ్డి, రమణారెడ్డి, కన్యాకుమారి, క్రిష్ణారెడ్డి, నరేష్, ధారా శంకర్, మల్లికార్జున, సూర్యనారాయణరెడ్డి, మలిరెడ్డి, నరసింహారెడ్డి, పైపల్లి సూరి, తిరుపాల్‌నాయక్, ఈశ్వరయ్య, ఆంజనేయులు, శేఖర్, మాబు, బాలు, సతీష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, చంద్రశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు. నల్లమాడ మండల సమావేశంలో కన్వీనర్ కె.సూర్యనారాయణ, ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, మైనార్టీ సెల్ కార్యదర్శి ఎస్‌హెచ్ బాషా, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ, మాజీ కన్వీనర్లు పొరకల రామాంజనేయులు, కుళ్లాయినాయక్, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ గంగిశెట్టి, సర్పంచ్‌లు కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, ప్రసాద్, ప్రమీలమ్మ, మాసే రెడ్డెమ్మ, లింగమూర్తి, ముక్తాపురం రమణారెడ్డి, నాగరాజునాయుడు, ఎంపీటీసీలు, మాజీ డీలర్లు, మాజీ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు బుక్కపట్నం మండల వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం

పుట్టపర్తి: బుక్కపట్నం మండల వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం గురువారం ఉదయం 9.30 గంటలకు పుట్టపర్తిలోని కార్యాలయంలో నిర్వహించనున్నారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హాజరవుతారని మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ధర్నా జయప్రదం చేయండి

ధర్మవరం: ఈ నెల 11న మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు కోరారు. పట్టణంలోని ఎన్జీఓ హోంలో బుధవారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రీషియన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు హాజరై మాట్లాడారు. 650-2 సర్వే నంబర్‌లో అనర్హులు డూప్లికేట్ పట్టాలు చేయించుకుని కట్టడాలు నిర్మిస్తున్నారని, వారి పట్టాలను తొలగించి ప్లంబర్ కార్మికులకు న్యాయం చేయాలని కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా ఎలాంటి చర్యలూ చేపట్టలేదన్నారు. అధికారుల వైఖరిని నిరసిస్తూ 11న ధర్నా చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడగ వెంకటనారాయణ, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సకల రాజా, ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి అన్నం లక్ష్మీనారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆంజనేయులు, సభ్యులు తాజ్, రామసుబ్బయ్య, చిన్న, మసూద్, సురేంద్ర, నాగేంద్ర, దాదాపీర్, రామకృష్ణ, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల కోసం రోడ్డెక్కారు!



రాస్తారోకో చేస్తున్న కాలనీలవాసులు

ఓడీచెరువు: తాగునీటి కోసం ప్రజలు రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ టవర్, మదీనా మసీద్ వీధి కాలనీల్లో కొన్ని రోజులుగా నీటి సమస్య ఉంది. అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కాలనీల వాసులు బుధవారం కదిరి - హిందూపురం మార్గంలో రాస్తారోకో చేశారు. అనంతరం నీటి ట్యాంకర్‌ను పంపించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారని, తమకు శాశ్వత పరిష్కారం కావాలని కాలనీల వాసులు కోరుతున్నారని పార్టీ పుట్టపర్తి డివిజన్ కార్యదర్శి మున్నా తెలిపారు.

108లో ప్రసవం



నవజాత శిశువును చూపుతున్న దృశ్యం

ముదిగుబ్బ: బ్రాహ్మణపల్లికి చెందిన శివమ్మ బుధవారం పురిటి నొప్పులతో బాధపడుతుండడంతో 108 వాహనంలో కదిరిలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండటంతో వారిని కదిరిలోని ఆస్పత్రికి చేర్చినట్లు 108 సిబ్బంది రవికుమార్, బాల ఓబులేసు తెలిపారు.

ఫాంహౌస్‌లో గ్రీవెన్స్

- ప్రజలకు వ్యయప్రయాసలు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి మండలాలకు సంబంధించి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి బుధవారం పుట్టపర్తికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఫాంహౌస్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అయితే ఆయా మండలాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను విన్నవించుకోవడానికి ఫాంహౌస్ వద్దకు చేరుకోవడానికి చాలా వ్యయప్రయాసలకోర్చాల్సి వచ్చింది. ప్రజాప్రతినిధి తమ సౌకర్యం చూసుకున్నారు తప్ప ప్రజలు ఎంత ఇబ్బందులు పడతారో ఆలోచించలేకపోయారని పలువురు చర్చించుకోవడం కనిపించింది. జిల్లా కేంద్రంలోనే గ్రీవెన్స్ పెడితే బాగుంటుందని చర్చించుకున్నారు.

తోటి మనుషులకు సాయం చేయండి



ఫెర్రర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మహిళలు

బత్తలపల్లి: తోటి మనుషులకు సాయం చేయడం, మంచి పని చేయడమే ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఫాదర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కోడేకండ్ల, ఈదుల ముష్టూరు, జ్వాలాపురం తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆర్డీ ప్రమీల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

నల్లచెరువు: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 105వ జయంతి వేడుకలను బుధవారం వినాయక వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నల్లమాడ: ఆర్డీటీ వ్యవస్థాపకుడు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేదల పెన్నిధి అని వక్తలు కొనియాడారు. నల్లమాడ మండలంలోని దొన్నికోట, కుటాలపల్లి, ఎనుములవారిపల్లి, కొండ్రవారిపల్లి, పెమనకుంటపల్లి తండా, వేళ్లమద్ది, యర్రవంకపల్లి తదితర గ్రామాల్లో ఫాదర్ ఫెర్రర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

కనగానపల్లి: పేద ప్రజల కోసం పని చేసిన విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల తెలిపారు. బుధవారం ఆర్డీటీ వ్యవస్థాపకుడు విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ జయంతిని మండలంలోని పలు గ్రామాల్లో జరుపుకున్నారు. ముక్తాపురం గ్రామంలో ఆర్డీ, ఆర్డీటీ సిబ్బంది పాల్గొని ఫాదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ధర్మపురిలో ఉచిత వైద్య శిబిరం

ధర్మవరం రూరల్: ధర్మపురిలో ఫాదర్ ఫెర్రర్ జయంతిని పురస్కరించుకొని సోమలరాజు ఫౌండేషన్, యువర్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మండల వ్యాప్తంగా పలు చోట్ల జయంతి వేడుకలు జరిగాయి.

వెల్డింగ్ చేస్తుండగా కుప్పకూలిన వర్కర్

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- మృతదేహంతో బంధువుల రాస్తారోకో



మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

ఓడీచెరువు : షెడ్డు ఏర్పాటుకు సంబంధించి వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో వెల్డర్ ఉన్నపళంగా కుప్పకూలాడు. ఆస్పత్రికి తరలించినా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ మృతదేహంతో బంధువులు రోడ్డుపై ధర్నా చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఓడీచెరువుకు చెందిన రహంతుల్లా (30) వెల్డింగ్ పని చేసుకుంటూ భార్య, కుమారుడిని పోషించుకునేవాడు. బుధవారం బాబాసాహెబ్ పల్లిలో సురేంద్రకు చెందిన కోళ్ల ఫారం షెడ్ నిర్మాణానికి రహంతుల్లా వెల్డింగ్ పనికి వెళ్లాడు. పనిలో నిమగ్నమైన అతడు సాయంత్రం వేళ ఉన్నపళంగా పడిపోయాడు. వెంటనే అక్కడున్న వారు అతడిని హుటాహుటిన కదిరి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో రాత్రి ఏడున్నర గంటల తర్వాత చనిపోయాడు. పని కోసం వచ్చి ఇలా అర్ధంతరంగా ప్రాణం కోల్పోయాడని, కుటుంబాన్ని కోళ్లఫారం యజమాని ఆదుకోవాలని బంధువులు రాత్రి పది గంటల నుంచి కదిరి - హిందూపురం హైవేపై మృతదేహంతో రాస్తారోకో నిర్వహించారు. అర్ధరాత్రి దాటినా ఆందోళన కొనసాగడంతో పొద్దుపోయేదాకా సాగింది. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని సీఐ నరేంద్రరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. మృతుడు రహంతుల్లా భార్య అమ్మాజాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

సంక్షిప్త వార్తలు

బాలిక అదృశ్యం

కదిరి అర్బన్: ఓ గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బుధవారం రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

డివైడర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

పుట్టపర్తి అర్బన్: డివైడర్‌ను ఢీకొన్న ద్విచక్ర వాహనదారునికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని సుబ్బరాయునిపల్లికి చెందిన ప్రసాద్ గృహప్రవేశ కార్యక్రమానికి బైక్‌పై వెంకటగారిపల్లికి వెళ్లాడు. కార్యక్రమం ముగించుకుని ఇంటికి బయల్దేరాడు. గ్రామ సమీపంలో 342 జాతీయరహదారిపై అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రసాద్‌కు కాలు విరిగింది.

కేసు నమోదు

కదిరి అర్బన్: మీటీనాయక్‌తండాకు చెందిన అన్నదమ్ములు క్రిష్ణానాయక్, బాలాజీనాయక్ బుధవారం టెంకాయచెట్ల విషయమై గొడవపడ్డారు. పరస్పర ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

20న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 20న 54వ రాష్ట్ర స్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ జట్ల (మెన్, ఉమెన్) ఎంపిక నిర్వహించనున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు విజయ్‌కుమార్ తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 20న ఉదయం 9 గంటలకు తమ ఆధార్‌కార్డు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 83176 73593, 94900 60424 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ

కనగానపల్లి: ముత్తవకుంట్లలో బుధవారం ఎమ్మెల్యే పరిటాల సునీత నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పలువురు విద్యుత్‌శాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తాడిమర్రి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు సుప్రమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్మన్ వెంకటేష్ బుధవారం ప్రారంభించారు.

ఆరోగ్య పరీక్షలపై ఆరా

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మొబైల్ బస్సులో నిర్వహిస్తున్న నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల పరీక్షల గురించి రోగులతో డీఎంహెచ్ఓ ఫైరోజా బేగం ఆరా తీశారు.

ఆర్టీసీ ఆదాయం పెంచుదాం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీటీఓ

పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఆర్టీసీ ఆదాయాన్ని పెంచి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలుపుదామని డీపీటీఓ మధుసూదన్ పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తిలోని ఆర్ఎం కార్యాలయంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ పర్సన్స్, అకౌంట్స్ డిపార్టుమెంట్ సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఆదాయం పెంచడానికి అందరూ సమష్టిగా కృషి చేద్దామన్నారు.

కచ్చితమైన తూకాలు ఇవ్వండి

ముదిగుబ్బ: రేషన్ షాపులకు కచ్చితమైన తూకాలతో బియ్యం సరఫరా చేయాలని ఆర్డీఓ మహేష్ ఆదేశించారు. బుధవారం ఆయన ముదిగుబ్బలోని స్టాక్ పాయింట్‌ను ఆర్డీఓ తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నారాయణస్వామి, సీఎస్‌డీటీ మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు వెళ్లొద్దు

ధర్మవరం రూరల్: ప్రజలు గొడవల జోలికెళ్లరాదని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. బుధవారం ఫ్యాక్షన్ ప్రభావిత రావులచెరువులో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడారు.

పాఠశాలలను బలోపేతం చేద్దాం

పుట్టపర్తి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామని యూటీఎఫ్ పిలుపునిచ్చింది. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం కొత్తచెరువు బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో డీఈఓ కృష్ణప్ప చేతుల మీదుగా 'నేడు ప్రభుత్వ బడులలో పిల్లలను చేర్పిద్దాం, ప్రభుత్వ బడులను బలోపేతం చేద్దాం' అనే నినాదంతో కూడిన పోస్టర్లను ఆవిష్కరించారు.

అంబేడ్కర్ జయంతికి ఆదేశాలివ్వండి

ప్రశాంతి నిలయం: జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ నాయకులు బుధవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

'నోరు అదుపులో పెట్టుకో'

పుట్టపర్తి టౌన్: రామగిరి ఎస్ఐ సుధాకర్ యాదవ్ నోరు అదుపులో పెట్టుకోవాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి హితవు పలికారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికార పార్టీ చెప్పినట్టు నడుచుకునే ఎస్ఐకి మాజీ ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదన్నారు. అవాకులు చెవాకులు పేలడం మానుకోవాలన్నారు.

ముగిసిన వేమన ఉత్సవాలు



గొడుగు ఊరేగింపు చేస్తున్న పీఠాధిపతులు

గాండ్లపెంట: కటారుపల్లిలో నాలుగు రోజులుగా సాగుతున్న విశ్వకవి యోగి వేమన ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరిరోజు పీఠాధిపతులు స్వామి గొడుగును పూలతో అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి, అనంతరం పురవీధుల గుండా ఊరేగించారు. భక్తులు పూజలు చేసి, టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో పీఠాధిపతులు చెన్నారెడ్డి, వెంకటరెడ్డి (వైట్ రెడ్డి) నందవేమారెడ్డి, ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.